క్లుప్తంగా

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని దిగువ మోదలపల్లె, ముట్టుకూరులో 104 వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహనన్‌వేలు గర్భవతులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో 75 మంది రోగులకు పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి నిత్య అన్నదానానికి రూ.లక్ష విరాళంను ఆలయ అధికారులకు విశాఖపట్నంకు చెందిన దాత వెంకటపతిరావు అందించారు. బుధవారం సాయంత్రం దాత కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి నిత్య అన్నదానంకు విరాళం అందించారు. వారికి ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్ వేడుకలు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలో గురువారం బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకోనున్నారు. ఈద్గా, మసీదులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

బీమాను వినియోగించుకోండి

బంగారుపాళెం: బీమా ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఏజీఎం రమేష్ అయ్యర్ తెలిపారు. మండలంలోని తంబుగానిపల్లెలో బుధవారం జేసీసత్రం స్టేట్‌బ్యాంక్ శాఖ ఆధ్వర్యంలో 'జన సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఏడాదికోసారి తక్కువ ప్రీమియంతో బీమా చేసుకున్నట్లైతే ప్రమాదంలో చనిపోయినా, అంగవైకల్యం చెందిన రూ.2 లక్షల వరకు ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన (పిఎంజేజేబివై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బివై) తో లబ్ధి, చెల్లించాల్సిన ప్రీమియంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ రవి, జయరామరాజు, ఎంపీటీసీ శంకర్‌రెడ్డి, మంగళపల్లె సర్పంచ్ మురళి పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ బహిరంగ సభ

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధి హామీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ రెడ్డెమ్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతున్నారు. ఉపాధి హామీ కూలీలు పాల్గొనాలని ఆమె కోరారు.

ముగిసిన ధ్యానయజ్ఞం



ప్రసంగిస్తున్న మాస్టర్ బాలాజీ

తవణంపల్లె: మండలంలోని సిద్దంపల్లె సమీపంలో ఉన్న శ్రీ విఘ్నేశ్వర మహా పిరమిడ్ శక్తి క్షేత్రంలో 11 రోజుల పాటు నిర్వహించిన సామూహిక సంకల్ప ధ్యాన యజ్ఞం బుధవారం ముగిసింది. సీనియర్ మాస్టర్ బాలాజి భగవద్గీత ప్రవచనాలను తెలిపారు. కార్యక్రమంలో పలు ప్రాంతాల నుంచి ధ్యానులు పాల్గొని ఈ యజ్ఞాన్ని విజయవంతం చేశారు.

వేడుకగా అర్జున తపస్మాన్



పాలసముద్రం : మండలంలోని కృష్ణమ్మపురంలో వెలసిన ద్రౌపదీదేవి అమ్మవారి మహాభారత ఉత్సవాలు భాగంగా రాత్రి ద్రౌపదీ వస్త్రాపహరణం నాటకం ఆకట్టుకుంది. బుధవారం అర్జున తపస్మాన్ వేడుకగా జరిగింది. శ్రీవేంకటేశ్వర కళామండలి అర్జున వేషధారి పీలేరు శివ తపస్మాన్ చెట్టులోని ప్రతి మెట్టుకూ పరమశివుడిని ప్రార్థించే పద్యాలు ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించాడు. సంతానం లేక బాధపడుతున్న పలువురు మహిళలు తపస్సుమాను వద్ద వరపడి సంతానం కలగాలని వేడుకున్నారు. అర్జునుడు తపస్సుమాను మీద నుంచి పూలు, నిమ్మకాయలు, విబూదిపండ్లు విసరడంతో వాటి కోసం భక్తులు ఎగబడడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ప్రజలు పెద్దఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

పశు బీమా రైతుకు ధీమా

ప్రస్తుతం పశుపోషణ రైతులకు జీవనాధారంగా మారింది. వ్యవసాయం కంటే ఎక్కువగా పశువులనే నమ్ముకుని జీవిస్తున్నారు. అయితే ప్రమాదాలు, విపత్తులు, అనారోగ్యం వంటి కారణాలతో పశువులు మృత్యువాత పడినప్పుడు రైతులు జీవనాధారాన్ని కోల్పోతున్నారు. ఆ నష్టాన్ని భర్తీ చేసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకాన్ని అమలు చేస్తోంది. దానిపై పశు సంవర్థక శాఖాధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ బీమా ప్రీమియం చెల్లింపులోనూ ప్రభుత్వం రాయితీ కల్పించడం మరో విశేషం.

- రేషన్ కార్డుదారులకు 80 శాతం రాయితీ
- ప్రమాదాల్లో మరణించే పశువులకు బీమా వర్తింపు
- పశుపోషకులకు ఊరట



వైఎస్సార్ పశుబీమాపై అవగాహన కల్పిస్తున్న తవణంపల్లె పశువైద్యాధికారి లావణ్య



ఆవుకు బీమా చేసుకున్న రైతు

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లో చిన్న, సన్నకారు రైతుల పశుపోషణపై ఆధారపడి జీవించే కుటుంబాలకు వైఎస్సార్ పశు బీమా పథకం వరంలాంటిది. ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పథకం ద్వారా మూగజీవాలను పోషించే రైతులకు (తెల్లరేషన్ కార్డుదారులు) మూడేళ్లకు బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వం 80 శాతం రాయితీ కల్పించి ఊరట కల్పించింది. ప్రభుత్వం ప్రమాదవశాత్తు మరణించే పశువులకు బీమా వర్తించడంతో ఆ కుటుంబాలకు దన్నుగా నిలుస్తోంది. దీనిపై గ్రామీణ ప్రజలకు వెటర్నరీ అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తవణంపల్లె మండలంలో తవణంపల్లె, గాజులపల్లెలో పశువైద్యశాల (వెటర్నరీ డిస్పెన్సరీలు) ఉన్నవి. ఇద్దరు పశువైద్యాధికారులు, పారా వలంటీర్లు 8 మంది, గోపాలమిత్రలు 4 మంది, వెటర్నరీ అసిస్టెంట్లు 8 మంది పని చేస్తున్నారు. మండలంలో పశువులు 18,059, గొర్రెలు 4500, మేకలు 3650 ఉన్నాయి.

పశుబీమా పథకం వర్తింపు

- వరదలు, తుపాన్లు, పిడుగు పడి పశువులు మృత్యువాత పడినా, పాము కాటు, అడవి జంతువుల దాడి, అగ్ని ప్రమాదం, రోడ్లు, రైలు ప్రమాదాలు, అనారోగ్యం కారణంగా పశువులు చనిపోయినప్పుడు వైఎస్సార్ పశు బీమా పథకం వర్తిస్తుంది.
- పశువుల యజమాని ఉద్దేశపూర్వకంగా పశువులకు హాని తలపెడితే బీమా వర్తించదు. రాష్ట్ర, జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి పరిధిలో ప్రమాదాలకు మాత్రం పశుబీమా వర్తిస్తుంది.

పశుబీమా వర్తించేది వీటికే

- ఉత్పాదక దశలో ఉన్న ఒక సారి ఈనిన 2–10 ఏళ్ల ఆవులు, 3–12 ఏళ్ల గేదెలకు పశుబీమా వర్తిస్తుంది.
- ఒకటిన్నర ఏడాది పైబడిన మేలు జాతి (సంకర జాతి, దేశీయ) ఎద్దులు, దున్నలకు, రెండేళ్ల పైబడిన నాటు ఎద్దులు, దున్నలకు వర్తిస్తుంది.
- 6 నెలలు వయసు గల గొర్రెలు, మేకలు, పందులకు వర్తిస్తుంది.
- పశువు వయస్సు సంబంధించి పశువైద్యాధికారితో దంత అమరిక ద్వారా నిర్ధారిస్తారు.
- ఒక కుటుంబానికి 5 పశువులకు వరకు పశు బీమా వర్తిస్తుంది.
- గొర్రెలు, మేకలు, పందులు అయితే ఒక కుటుంబానికి ఒక ఏడాదికి 50 జీవాల వరకు పశుబీమా వర్తిస్తుంది.

బీమా ప్రీమియం చెల్లింపు

- తెల్లరేషన్ కార్డుదారులు రాయితీతో మూడేళ్లకు రూ.384 రైతులు వాటా ప్రీమియం చెల్లించాలి.
- మిగిలిన రైతులు రూ.960 బీమా ప్రీమియం చెల్లించాలి
- మండలంలో ఇప్పటివరకు 256 పశువులకు, 25 గొర్రెలకు బీమా చేశారు.

పేద రైతులకు వరం



ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకం సన్న, చిన్నకారు రైతులకు వరం. రైతులు బీమా ప్రీమియం చెల్లించడానికి రాయితీ ఇచ్చింది. పశువులు మృత్యువాత పడినప్పుడు రైతుకు తగిన పరిహారం అందుతుంది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– లావణ్య, వెటర్నరీ అధికారి, తవణంపల్లె

పాడి రైతులకు అండగా..



పాడి రైతులకు అండగా ఉంటూ ప్రభుత్వం పశుబీమా పథకం ప్రవేశపెట్టింది. ప్రమాదాల్లో చనిపోయిన పశువులకు బీమా తగిన పరిహారం చెల్లించి ఆదుకోవడం మంచి తరుణం. దీనికి రైతులు చెల్లించాల్సిన వాటాలో రాయితీ ఇవ్వడం సంతోషకరం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– ఢిల్లీప్రసాద్, పాడిరైతు, మిట్టపల్లె

మరింత అవగాహన కల్పించాలి



వైఎస్సార్ పశుబీమా పథకం రైతులకు వరం. చాలా మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ పథకం ఆ కుటుంబాలకు అండగా నిలుస్తోంది. ఈ బీమా పథకంపై మరింత అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రభుత్వం రైతులకు మేలు చేకూరుస్తోంది.

– మనోజ్, పాడిరైతు, మిట్టపల్లె

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

గుడిపాల: చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రి ఆవరణలో మెడికల్ కళాశాలకు భూమిపూజ, 300 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూలై 4వ తేదీన రానున్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, యువత అధ్యక్షుడు శిలంబరసన్ కలిసి సీఎం ల్యాండింగ్ కోసం హెలిపాడ్ ఏర్పాటు చేసిన స్థలం, భూమిపూజ నిర్వహించే స్థలాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంసీ అడ్మిన్ ప్రిన్స్, సర్వేయర్ కిరణ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలనలో కమిషనర్



గంగినేని చెరువు వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సీఎం పర్యటనకు ముందస్తు ఏర్పాట్లు పనుల్లో నిమగ్న మయ్యారు. గంగినేనిచెరువుపై రోడ్డు మరమ్మతులు, నగరంలో బ్యానర్ల తొలగింపు, సుందరీకరణ పనులు వేగంగా చేపడుతున్నారు. పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనులను బుధవారం కమిషనర్ అరుణ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయడంతో పాటు నాణ్యత ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ ఉన్నారు.

కోదండరాముడి బ్రహ్మోత్సవాలు ఆరంభం



ధ్వజారోహణ పూజల్లో అర్చకులు



హంస వాహనంపై ఊరేగుతున్న శ్రీరామచంద్రుడు

- వైభవంగా ధ్వజారోహణం
- హంస వాహనంపై ఊరేగిన శ్రీరామచంద్రులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరు కోదండ రాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. అర్చకులు సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు బుధవారం ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ధ్వజస్తంభానికి ధ్వజాపటాన్ని కట్టి ఎగురవేశారు. సీతారామలక్ష్మణుల ఉత్సవవిగ్రహాలను ఊరేగించారు. ధ్వజాస్తంభానికి పాలు, పెరుగు, తేనె, శుద్ధి జలాలతో అభిషేకం చేయించి ధూపదీపనైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఉదయం స్వామికి తిరుమంజనం, పాలాభిషేకం సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. రాత్రి ఉభయదారులతో హంస వాహన సేవ నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, గజమాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు అభిషేకం పూజలు చేసి హంస వాహనాన్ని ముస్తాబు చేశారు. హంస వాహనంపై శ్రీరామచంద్రుడు కొలువుదీరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

ఆలయంలో గురువారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రిలో సింహ వాహన సేవ ఉభయదారులచే వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సిద్దేశ్వర రెడ్డి తెలిపారు.

అవకాశాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన అవసరమని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నాగయ్య కళాక్షేత్రంలో బుధవారం హెచ్‌సీఎల్ టెక్‌బీ కార్యక్రమం అమలుపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐటీ రంగంలో స్థిరపడాలనుకునే వారు అతి తక్కువ ఖర్చుతో హెచ్‌సీఎల్ కంపెనీ సమన్వయంతో శిక్షణ పొంది ఉద్యోగాలను పొందవచ్చని చెప్పారు. ఒక ఏడాది శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం నేరుగా ఐటీ ఉద్యోగాల్లో చేరే అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్టర్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ తులసి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, డీఈవో విజయేంద్రరావు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ డీడీలు రాజ్యలక్ష్మి, రబ్బానీ బాషా, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ, ఆర్‌ఐవో రమేష్, డీవీఈవో దయానందరాజు, పలు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రిజర్వ్‌ఫారెస్టులో స్మగ్లింగ్‌కు యత్నం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులోని రిజర్వ్‌ఫారెస్టు ఎర్రచందనం స్మగ్లింగ్‌కు యత్నించిన సంఘటన నాలుగురోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రిజర్వ్ ఫారెస్టులో అర్ధరాత్రి 2 గంటల సమయంలో నాలుగు ఎర్రచందనం చెట్లు నరికి, దుంగలను ద్విచక్రవాహనంపై స్మగ్లింగ్ చేయడానికి ఇద్దరు ప్రయత్నించారు. ఆ అలికిడికి గస్తీలో ఉన్న అటవీశాఖ గార్డులు అటువైపుగా వెళ్లారు. వారిని చూసిన దొంగలు ద్విచక్రవాహనాన్ని వదిలిపెట్టి అక్కడి నుంచి పరారయ్యారు. ద్విచక్ర వాహనాన్ని, దొంగలు నరికిన దుంగలను అటవీశాఖ అధికారులు సీజ్ చేశారు. ద్విచక్ర వాహనం ఆధారంగా దొంగల ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు ఎఫ్‌ఆర్వో థామస్ తెలిపారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



సన్మానం అందుకున్న బదిలీ అయిన ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాలలో విద్యార్థులు ఘనంగా సన్మానించారు. దీనికి హాజరైన డీఈఓ విజయేంద్రరావు మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల సేవలు మరవలేమని పేర్కొన్నారు. ఎక్కడ పనిచేసినా విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లడంలో ఉపాధ్యాయులు ప్రముఖ పాత్ర వహిస్తారని చెప్పారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులకు దామోదరం నాయుడు, సురేష్, మాధవి, గౌరి, బుజ్జి, రమ, వసుంధరకు శాలువ కప్పి సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, ఎంపీడీఓ గౌరి, పూతలపట్టు ఎంఈఓ కృష్ణారెడ్డి, ఐరాల ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, చిత్తూరు ఎంఈఓ మోహన్, గుడిపాల ఎంఈఓ గణపతి, సర్పంచ్ మాసిలామణి, ఉప సర్పంచ్ లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవాస్తవాలను ఖండిస్తున్నాం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డిపై జనసేన నాయకులు కిరణ్ రాయల్ చేస్తున్న అవాస్తవాలను ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. వారు బుధవారం చిత్తూరులో మీడియాతో మాట్లాడారు. శ్రీవాణి ట్రస్టుకు సంబంధించిన వాస్తవాలను భానుప్రకాష్‌రెడ్డి తెలియజేస్తే దానిపై కిరణ్‌రాయల్ కులాన్ని అపాదిస్తూ విమర్శించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, రామభద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

ఐరాల: పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందే రైతులు ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ వరలక్ష్మి సూచించారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతూ ఆధార్, దానికి అనుసంధానమైన ఫోన్ నంబరు, అలాగే ఓటీపీ ఆధారంగా ఈ నెల 30వ తేదీ లోపు అథెంటికేషన్ చేసుకోవాలని సూచించారు. రైతు భరోసా కేంద్రం అసిస్టెంట్లను, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లను సంప్రదించి వేలిముద్రలతో ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు.

ఇంట్లో అగ్నిప్రమాదం

చిత్తూరు కలెక్టరేట్ : నగరంలోని సంతపేట బండ్లవీధిలో ఉన్న ఇంట్లో బుధవారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే మంటలు అదుపుచేశారు. ఇంటి యజమాని కుట్టి బీడీలు కాల్చి పడివేయడం వల్ల అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ సిబ్బంది వెల్లడించారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల అమలుపై ఆరా
- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు



కొత్తగొల్లపల్లెలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న పూతలపట్టు ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు

తవణంపల్లె: ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తగొల్లపల్లె, కర్ణంవాండ్లవూరు, నలిశెట్టిపల్లె గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను గణాంకాలతో వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సంపూర్ణ అభివృద్ధి చెందుతోందని చెప్పారు. నవరత్నాలతో ప్రతి ఇంటిలో లబ్ధిపొంది జగనన్నను ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మరింత లబ్ధిపొందడానికి జగనన్నను మరో సారి సీఎం చేయాలని పిలుపు నిచ్చారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలని, రేషన్‌కార్డులు, ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని, కర్ణంవాండ్లవూరులో వాటర్‌ట్యాంకు మంజూరు చేయాలని, నలిశెట్టిపల్లెలో శ్మశాన స్థలాన్ని సర్వే చేసి హద్దులు చూపాలని తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్యలు పరిష్కరించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం

విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు సూచించారు. ఆయన కొత్తగొల్లపల్లె పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఉపాధ్యాయులను నియమించాలని, విద్యార్థులు, స్థానికులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బాబు డీఈఓతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి నిధులు కేటాయిస్తామన్నారు. అనంతరం విద్యార్థులతో కొంతసేపు ముచ్చటించారు. తహసీల్దార్ గుణశేఖర్ రెడి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, సర్పంచ్ హంసవేణి, మండల సచివాలయ కన్వీనర్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శేఖర్ రెడ్డి, పరమేశ్వరరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, డేవిడ్, వాసు, జనార్దన్, వరదరాజులు, రవి, పొన్నెయ్య, సుబ్రమణ్యం, రామ్మూర్తి, ధర్మయ్య, బుజ్జయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు నారసింహనపల్లెలో..

మండలంలోని నలిశెట్టిపల్లె సచివాలయం పరిధిలోని నారసింహనపల్లె, తెల్లగుండ్లపల్లె పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీపీ గీతారెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్ తెలిపారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.





పండుగలా అమ్మ ఒడి

జిల్లా స్థాయి అమ్మఒడి కార్యక్రమాన్ని బుధవారం పలు పాఠశాలల విద్యార్థులు పండుగలా నిర్వహించారు. సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఆ విద్యార్థులను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ అభినందించారు.

- చిత్తూరు కలెక్టరేట్

ఉన్నత విద్యకు మరో అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత విద్యకు దూరమైన విద్యార్థులకు సదవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సల్ ఎడ్యుకేషనల్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ మామిడి అశోక్ అన్నారు. నగరంలోని గాయత్రీ నగర్‌లో బుధవారం యూనివర్సల్ ఎడ్యుకేషనల్ అకాడమీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులకు దూరమైన విద్యార్థులకు సౌకర్యార్థంగా అకాడమీని ప్రారంభించినట్లు చెప్పారు. ఆన్‌లైన్‌లో చదువుకునే వెసులుబాటుతో దూరవిద్యను అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో శామ్యూల్‌బాబు, రంగనాథం, రాయల్ కుట్టి, భానుశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.